# సియ్యాల పండగ

## తవ్వా ఓబుల్‌రెడ్డి

"**మా** ఊళ్ళో ఏ పండగ వచ్చినా, ఏ సంబరం జరిగినా, నారాయణ చేసే సందడి అంతా ఇంతా కాదు ! సిన్నప్పటి నుంచీ నారాయణ యవ్వారమే అంత అని మా నాయన చెబుతా ఉంటాడు. సంకురాత్రి పండగయితే నారాయణను పట్టుకోడానికి పగ్గాలుండవ్ ! ఊళ్ళో ఇళ్ళిళ్ళూ తిరుగుతా ఉంటాడు. ఏ ఇంట్లో ఏ వంటలు సేచ్చాం దారు? ఏఏ ఊర్లనుండీ చుట్టాలు వచ్చినారు? ఊళ్ళో దేవుని ఊరేగింపు ఎట్ల జేచ్చే బాగుంటది? పారువేట రోజున ఏ జామున యాటపొట్టేళ్ళు, కోళ్ళు కోయాల? దేవుని ముందర చిందులు కట్టె వరసలు ఎవరెవరు వేయాల?ఇయన్నీ మాట్లాడుతా ఉంటాడు నారాయణ. ఉత్తప్పుడైతే ఊళ్ళో, చేలల్లో పద్యాలు, తత్వాలూ పాడతా తిరుగుతా రాత్రిళ్ళు కూడా ఎవరినీ నిద్దర పోనియ్యడు.


ఒక్క నారాయణకే గాదు ! సంకురాత్రి పండగంటే మా ఊరోళ్ళందరికీ బలే సంబరమనుకో! కొత్తగుడ్డలు కట్టుకొని, ఇళ్ళలో కాల్చిన నిప్పట్లూ, కారాలూ, కజ్జికాయలూ, లడ్డు ముద్దలూ తినొచ్చునని పిల్లోళ్ళ సంబరం. ఆరుగాలం చేసిన కట్టం మరిచి పోయి కుశాలగా ఉండొచ్చునని పెద్దోళ్ళ సంబరం... ఆడోళ్ళకు కొత్తకోకలూ, సొమ్ములు తెచ్చుకుని కట్టుకునే సంబరం... కొత్తల్లుళ్ళకూ, కొత్తపెళ్ళి కూతుళ్ళకూ మొదటి సంకురాత్రి సంబరం... ఇంత చుక్క రొంత ముక్క చప్పరించొచ్చునని ముసిలోళ్ల సంబరం...!

నారాయణకు అదేందో మెంటలొచ్చిందని రొండేళ్ళనుంచీ ఊళ్ళో అందరూ అనుకుంటా ఉండారు. నారాయణ చేతలూ, మాటలూ సూచ్చే నిజమేనని అనుకుంటరు ఎవరైనా. సెతుర్లాడతా, అందరినీ నవ్విచ్చా ఉండే నారాయణ ఈ సమచ్చరం పండక్కు ఊళ్ళో ల్యాకుండా పోవడం బాగా దిగులేసిందనుకో !

పండక్కు వారం దినాల ముందు నారాయణను పోలీసోళ్ళు పట్టుకోని బోయినారు ! నారాయణ బాంబులేయల్యా ! ఖూనీ చేయల్యా ! నారాయణ మంచికోసమే పోలీసోళ్ళు ఆ పని సేసినారు ! ఇశాకపట్నంలో పిచ్చాసుపత్రి ఉందం టనే...! ఆడికి తీసుకపోడానికే నారాయణను పోలీసోళ్ళు పట్టుకోని బోయినారు ! అందుకే ఈసారి సంకురాత్రికి నారాయణ ఊళ్ళో ల్యాకుండా పోయినాడు.

ఐదారేళ్ళ నుంచీ జరగకుండా పోయిన సంకురాత్రి సామి ఊరేగింపు ఈసారి పెద్దగా సేచ్చాండరులే ! సంకురాత్రి పండగొచ్చింటే పదీ, పదైదు ఏళ్ళ కిందటి పండగ సంబరాలు గుర్తుకు వచ్చాయి; మా ఊరోళ్ళకు ఎవరికైనా ! పండగకు శివుని ఊరేగింపు జరుగుతది ! ఒక్క రాత్రీ, ఒక్క పగలు కల్లా సుట్టూ పదారు పల్లెల్లో శివుడు సుడిగాలి తిరిగినట్లు తిరుక్కోని వచ్చాడు ! మా ఊరి శివాలయానికి మూడు తరాల నుంచీ రెడ్డేరింటోళ్ళే ధర్మకర్తలు ! అయితే ఈ నడుమన రాజకీయాలు అందరూ తెలుసుకున్నేక ధర్మకర్త పదవి వాళ్ళకూ, వీళ్ళకూ మారబట్టినాది ! అయితే ఎవరు ధర్మకర్తలైనా సంకురాత్రి సంబరాలు మాత్తరం బాగానే సేచ్చరులే!

పండగ పదినాళ్ళు ఉండగనే శివాలయంలో రోజూ పొద్దున మేళాలను వాయించడం మొదలు పెట్టారు. గుడికి సున్నంబేపిచ్చి, ప్రబలకు రంగులు గీయిచ్చారు ! పొద్దుటూరు నుంచీ ఔట్లూ, పటాకులూ తెప్పిచ్చారు ! కోయిల కుంట్ల నుంచీ బోగమోళ్ళను తోడకొచ్చరు....పారువేటకు కుందేలును పట్టకచ్చరు. బోగమోళ్ళు కులుకుతా... పాటలు పాడ్తారు... వయసొయసు మొగపిల్లోళ్లు ఇరవై, యాభై, నూరు రూపాయలను బోగమోళ్ళకు తగిలిచ్చారు. పదారు పల్లెల్లో బోగమోళ్ళు డ్యాన్సులు చేసి పాటలు పాడ్తారు. బోగమోళ్ళు ఒక టాక్టర్లో... తప్పెట్లూ, ఔట్లూ, లైట్లోళ్ళు ఇంగొక టాక్టర్లో... ఊళ్ళో పెద్దమనుషులు వేరే టాక్టర్లో పదారు పల్లెల్లో తిరుగుతారు. బోగమోళ్ళూ... మేళగాళ్ళూ దేవునికంటే ముందే ఒక్కో ఊరికి చేరుకోని సందడి సేచ్చా ఉంటారు. ఒక ఊరి నుంచీ మరొక ఊరికి దేవున్ని పొలాల్లో అడ్డంబడి మోసుకోని వచ్చారు. పసుపుతోటలుండినా.. వరి పైర్లుండినా తొక్కుకుంటానే దేవున్ని తీసుకొని వచ్చారు. పైర్ల గుండా దేవుడుపోతే పంట బాగా పండుతాదని మా వూరోళ్ళు నమ్ముతారు. ఊరి గవిన్లోకి దేవుడు చేరుకుంటానే 'ధాం' అని పెద్ద అవుటు పేల్చుతారు. దేవుడు ఊళ్ళోకి అడుగు పెట్టినాడనే దానికి ఇది గురుతు ! ఆడోళ్ళు దేవునికి కాయ, కర్పూరం సిద్ధం చేసుకుంటారు. పెళ్లికి ఎదిగిన ఆడపిల్లోళ్ళు ఊరేగింపు ముందర బిందెలతో నీళ్ళు పోచ్చా పోతాంటరు ! అట్ల నీళ్ళు పోసినోళ్ళకు బెరీన పెళ్ళి అయితదంట ! ఊళ్లోకి చేరుకున్న దేవున్ని రామస్వామి గుడివద్ద ఆపుతారు. దేవునికి ఒకపక్క పూజలు జరుగుతాంటే, ఇంగోపక్క బోగమోళ్ళ డ్యాన్సు జరుగుతాంటది ! దేవుని కాడ జనం పలచనగా ఉంటారు. బోగమోళ్ళ కాడ మాత్రం ఒకటే జనం ! డ్యాన్సు అయిపోగానే భలే విచిత్రమైన తంతు జరుగుతాదిలే...! బోగమోళ్ళు పూలదండలు యేసి సంభావనలు తీసుకునే తంతు అది ! కోడెకారు మొగపిల్లోల్లకూ, ముసిలోళ్లకూ అందరికీ మెడల్లో దండలు వేసి లెక్క ఇప్పిచ్చుకుంటారు. అర్ధనూట పదార్లు కొందరూ, నూట పదార్లు కొందరూ బోగమోళ్ళకు ఇయ్యాల్సిందే ! ఒకసారి నారాయణకు ఇట్లనే బోగమోళ్ళ పిల్ల మెడలో దండ యేసింది. "ఊరికే దండ బేచ్చే లెక్క ఎందుకియ్యాల... కాపురం సేచ్చే




కదా !" అంటా నారాయణ లెక్క ఇయ్యకుండా రోంత సేపు సారాకం ఆడినాడు. కొందరైతే మెడలో దండ పడీ పడంగానే జేబులో పెట్టుకోని ఉండే లెక్క తీసి టక్కున ఇచ్చారు...! కొందరు సిగ్గుపడతా... సందుల్లో గొందుల్లో దూరి బోగమోళ్ళకు చిక్క కుండా పరుగులు తీసుకుంటారు. రెడ్డేరు నాగేశ్వరరెడ్డి అయితే కొందరిని ఎంటవడి వట్టుకోని వచ్చి బోగ మోళ్ళతో దండలు బేయిచ్చాడు. ఈ తంతు అయిపోయేలోగా దేవునికి పూజలు కూడా అయిపోతాయి. గుమ్మడిపళ్ళూ, కొబ్బరి గిన్నెలూ, బియ్యమూ, పూజారికి ఇచ్చుకుంటారు ఊరోళ్ళు !... ఇట్ల జరుగుతా ఉన్నెది..... పండగ !

ఈసారి బోగిపండగ బలె బాగా జరిగింది. ఊరంతా పేనీళ్ళ జల్లి... రంగు రంగుల ముగ్గులు యేసుకున్నెరు.. బోగి మంటలు యేసుకున్నెరు... రెండోరోజు పెద్ద పండగ... ఈ పొద్దు మా ఊరోళ్ళకు సినిమాలే సందడి ! కడపకో, పొద్దుటూరికో పోయి సినిమాలు జూసి వచ్చరు ! సినిమాలకు పోయినోళ్ళు రాత్రి ఏ రెండుగంటలకో.. మూడు గంటలకో ఊరికి జేరుకుంటారు ! సీకటి ఇచ్చితే కనుమ పండగ ! ఈ పండగను మా ఊళ్ళో సియ్యాల పండగ అని అంటార్లే! తూరుపున సుక్క పొడసక ముందే పొట్టేళ్ళను, కోళ్ళను మేకపోతులను కోయబడ్తరు. నెలదినాల నుండి జొన్నలు మేసిన కోడిపుంజులను ఆఖరి కూతకు నోచుకోకుండానే కోసి వండుతారు. సీకటి ఇచ్చక ముందే సియ్యలు పొయ్యిమింద ఉడికిపోతాయి. తెల్లార్తాండగానే జనం పేగుల్లో పేగులూ, సియ్యల్లో సియ్యలూ కలిసిపోతాయి. సియ్యాల పండగ అంటేనే ఊళ్ళో తాగుడుబోతోళ్ళ సందడి అంతా ఇంతా కాదు. సాంపర్దాయకమైన తాగు బోతోళ్ళు నాటు సారాయి తెచ్చుకుంటే... వయ సొయసు పిల్లోళ్ళు టౌన్లోంచి సీసాలు తెచ్చుకుంటారు. చెరువుగట్టున నాటుసారా బట్టీ గూడా పెట్టినారు. నాటుసారాయి ఇళ్ళల్లో పెట్టుకుంటే పోలీసోళ్ళు వచ్చారనే భయంతో ఊరి చుట్టూ పసుపుతోటల్లో గుంతలు తీసి నాటు సారా జగ్గులనూ, సీసాలనూ బూడ్చిపెట్టుకున్నెరు. వాటిని కనుక్కుండే దానికి పెద్ద పెద్ద గుండ్రాళ్ళతో గురుతులు పెట్టుకున్నెరు. సియ్యాల పండగరోజు సీకటి ఇచ్చక ముందే సీసాల కోసం తోటలమ్మడి తారాడబట్టినారు. దొంగ దొంగగా మందు తాగే వయసొయసు పిల్లోళ్ళు కూడా పూటుగా తాగడానికి ఆ తోటల్లోనే నక్కి నక్కి తిరగబట్టినారు. పసుపు తోటల్లోని అముదపు చెట్లు కైపు ఎక్కినట్లుగా గాలికి తూలుడు మొదలుపెట్టినాయి. కోసిన పొట్టేళ్ళ, మేకపోతుల గుండెకాయలనూ, నేరెడు ముక్కలను ఉప్పూకారం వేసి వేయించుకోని పొట్లాలు గట్టుకొని తీసకపోయి మందులో నంజుకోబట్టినారు, తాగి నోళ్ళం దరూ ! "అబ్బ ఎంత మజాగా ఉంది... ఈ పొద్దు నారాయణ ఉన్నింటే ఎంత సందడిగా ఉండు" అనుకున్నారు వాళ్ళంతా !

అప్పుడే రోడ్డు దిక్కు ఏందో శబ్దం...! ఇజిలు వేసిన శబ్దం... పోలీసోళ్ళ ఇజిలు మాదిరిగా వినబడింది. "పోలీసోళ్ళు... పోలీసోళ్ళు.." అంటూ ఎవరో కేకలు వేసినారు. ముందుగా తోటల్లో తారాడేవాళ్ళకూ...ఆ తర్వాత ఊళ్ళో జోగాడేవాళ్ళకూ వినబడింది ఆశబ్దం ! తోటల్లోని వాళ్ళు తూలుతూ పడుతూ.. లేచ్చా అట్టా ఇట్లా పరిగెత్తబెట్టినారు. ముసిలోళ్ళు, వయసోళ్ళు ఒకరినొకరు ఢీలు తగల బెట్టినారు. ఊళ్ళోని వాళ్ళు ఇళ్ళల్లో సీసాలు తీసుకోని వంక చెట్లలోకి, తోటల్లోకి పరుగులు తీసినారు.

పోలీసు ఇజిలు శబ్దం దగ్గరగా వచ్చింది. చేతిలైటు వేసుకుంటూ ఇజిలు వేసుకుంటూ ఎవరో ముందుకు వచ్చాండరు ! ఇంకా తెల్లవారల్యా ! ఇజిలు వేసేవాళ్ల దిక్కు నుంచీ మాటలు కూడా వినబడ్తాండయి. ఆ మాటలు ఎక్కడో వినినట్లే ఉండాయి.

"నారాయణ మాటల మాదిరే ఉండాయే" అనుకున్నారు కొందరు..! పోలీసువాళ్ళు నాటు సారాయిని పట్టుకునేదానికి నారాయణను తోడ్కోని వచ్చాండారని అనుకున్నారు ఇంకొందరు.

పోలీసులు లేరు ఎవరూ లేరు. నారాయణ ఒక్కడే ఇజిలు ఊదుకుంటా వచ్చినాడని దగ్గరికి వచ్చి నాంక తెలిసింది. ఖాకీ చొక్కా ఖాకీ సల్లాడం యేసు కోని, వాటిపైన కోటు కూడా తొడుక్కోని విజిల్ ఊదుకుంటూ, చేతిలైటు యేసుకుంటూ వచ్చినాడు, నారాయణ !

వచ్చింది పోలీసోళ్ళు కాదని.. నారాయణ అని తెలుసుకోని తల కాయలు బాదుకున్నారు, తాగినోళ్ళం దరూ...!

"టేషన్లో ఎసయ్య రాజీనామా సేసినాడు.. ఈ పొద్దు నుంచీ నేనే మనూరికి ఎసయ్యను !" అంటూ ఇజిలు ఊదబట్టినాడు, నారాయణ. నారాయణ చేసిన పనికి అప్పటికే శానామందికి ఎక్కిన కైపు సర్రున దిగిపోయింది. చెవులు సల్లబడిపోయినాయి. పోలీసోళ్ళ గుడ్డలు తీసుకోని నారాయణ టేషన్ నుంచి తప్పిచ్చుకోని వచ్చినాడని ఊళ్ళో అందరికీ అర్థంఅయింది. నారాయణ నడి ఊళ్ళోంచి నడుచుకుంటూ ఇజిలు ఊదుకుంటూ ఏదోదో మాట్లాడతా... రామసోమిదేవళం కాడికి చేరినాడు.

పొద్దు పొడిచే తలికి ఊళ్ళోకి పోలీసోళ్ళు జీపు యేసుకోని వచ్చినారు. పోలీసోళ్ళను చూసిన నారాయణ దేవళంలోకి దూరి వాకిలికి గడె యేసు కున్నాడు. కిటికీ గుండా బయటికి సూచ్చా... పోలీసోళ్ళను తిట్టబట్టినాడు...!

పండగ అయిపోతానే ఇశాకపట్నానికి నారాయణను తీసుకుపోవాలనుకున్నామని.. రాత్రి సెంట్రీ యేమారి ఉండిన జామున టేషన్లో ఒక మూలన ఉండిన ఎవరివో టోపీ, ఖాకీగుడ్డలు, కోటు, ఇజిలు తీసుకోని తప్పించుకోని వచ్చినాడని పోలీ సోళ్ళు ఊళ్ళో పెద్దమనుషులకు సెప్పినారు. నారాయణపైన కేసు పెట్టి జైలుకు పంపుతామని కోపంగా కేకలు యేసినారు. ఊరి పెద్దలు పోలీ సోళ్ళను సముదాయించి, బతిమాలి నారాయణ తెచ్చిన గుడ్డలూ, టోపీ ఇజిలూ అంబళ్ళ పొద్దుకల్లా ఎట్నోకట్ల తీసుకువచ్చి అప్పజెప్పుతామని సెప్పు కున్నారు.

ఎక్కిన కైపు అనవసరంగా దిగినందుకు తాగినోళ్ళందరూ నారాయణ చేసిన పనికి కక్కాలేక మింగాలేక ఉండిపోయినారు. ఊళ్ళోని ఆడోళ్ళకూ, పిల్లోళ్ళకూ, కొత్త అల్లుళ్ళకూ, సారాయి తాగని వాళ్ళకూ ఈ తంతును భలే తమాషాగా చూసినారు. పండగపూటా ఊరంతా ఒకటే నవ్వులు ! ఈ ఏడు పండుగకు దూరమైపోయినాడనుకునే నారాయణ పోలీసు వేషంలో వచ్చి భలే సందడి చేసినాడు. ఈ సంకురాత్రికి ఇదే పెద్ద సందడి ! దేవుడి దయవల్ల బతికుంటే వచ్చే సమచ్చరం సంకురాత్రి పండగ గూడా సందడిగా జరుగతది మా వూరోళ్ళందరూ అనుకోబట్టినారు !